క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 28, బెండకాయ 23, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 47, పచ్చికాకర 23, పందిరి బీర 28, క్యాబేజీ 15, క్యారెట్ 28, దొండ 23, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 28, కీర 19, దోసకాయ 13, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 29, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు లాలాపేటలో కిషన్ రెడ్డి పర్యటన

లాలాపేట: కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం తార్నాక డివిజన్ లాలాపేటలో పర్యటించనున్నట్లు తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాము వర్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు లాలాపేట, సత్యానగర్, ఇందిరానగర్, శ్రీపురి కాలనీ ప్రజలను కలిసి మాట్లాడుతారన్నారు.

రేపు డీఎస్‌పీ విద్యార్థి విభాగం ఆవిర్భావ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రంలో రేపు(9న) ధర్మ సమాజ్ ప్రోగ్రామ్ స్టూడెంట్ వింగ్ (డీఎస్‌పీఎస్‌డబ్ల్యూ) ఆవిర్భావ సభను నిర్వహించనున్నట్లు డీఎస్‌పీ విద్యార్థి వింగ్ స్టేట్ అడ్వైజర్ కార్తీక్ తెలిపారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సైదాబాబు, లింగయ్య, శివ, ప్రసాద్, కార్తీక్, రాజు పాల్గొన్నారు.

కాంపిటిషన్ పోటీల్లో సత్తా



సత్తాచాటిన విద్యార్థులతో మురళీధర్‌రెడ్డి, బాటియ

అమీర్‌పేట: ఢిల్లీలో జరిగిన 10వ వార్షికోత్సవ మెగా కాంపిటీషన్ పోటీల్లో ఎస్‌ఆర్‌నగర్ బచ్‌పన్ అకాడమీ హైట్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు.వివిధ కేటగిరిల్లో జరిగిన పోటీలకు హాజరైన 43 మంది విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. వీరిలో 6 బంగారు, 6 సిల్వర్, 12 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి తెలిపారు. బహుమతులు ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాయిచుంగ్ బాటియ విద్యార్థులకు అవార్డులు అందజేసి రూ.5 వేల చెక్కును అందజేశారు.

సీతాఫల్‌మండి కాంగ్రెస్ అధ్యక్షుడిగా బండి అభిషేక్



చిలకలగూడ: సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిలకలగూడకు చెందిన బండి అభిషేక్ ముదిరాజ్ నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు అనీల్‌కుమార్‌యాదవ్ శనివారం ఉత్తర్వులు అందించారు. అభిషేక్ మాట్లాడుతూ.. గతంలో పలు హోదాల్లో అందించిన సేవలను గుర్తించి డివిజన్ అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేసి కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తానన్నారు. తనకు పదవీబాధ్యతలు అప్పగించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు అనీల్‌కుమార్‌యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశరావు, బీ-బ్లాక్ అధ్యక్షుడు జగదీశ్వరరావుకు కృతజ్ఞతలు అన్నారు.

ఫైర్‌మెన్ రాజుకు శౌర్య పతకం



సనత్‌నగర్: సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్‌లో లీడింగ్ ఫైర్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎనపోతుల రాజుకు తెలంగాణ శౌర్య పతకం వరించింది. హోంమంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా పతకం అందుకున్నారు. సెక్రటేరియట్ సమీపంలో ఉన్న ఆంధ్రాబ్యాంక్‌లో 2019 మార్చిలో జరిగిన అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న 39 మంది ఉద్యోగులను రాజు, బీఏ (బ్రీథింగ్ ఆక్సిజన్) సెట్ ధరించి ప్రాణాలను పణంగా పెట్టి కాపాడారు. దీనిని గుర్తించిన అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, ఆర్‌ఎఫ్‌ఓ హరినాథ్‌రెడ్డి, హైదరాబాద్ డీఎఫ్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, సికింద్రాబాద్ డీఎఫ్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, సనత్‌నగర్ ఎస్‌ఎఫ్‌ఓ ప్రదీప్‌కుమార్ అభినందించి రాజు ప్రతిభను కొనియాడారు. అదే విధంగా బోట్, రెస్క్యూ ఆపరేషన్స్‌లో తాను చూపిన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం తెలంగాణ శౌర్య పతకంతో సత్కరించింది.

మాతృత్వం మరో వరం!



- సంతానలేమి దంపతుల మోములో సంతోషం
- పైసా ఖర్చులేకుండా అన్నిరకాల వైద్యసేవలు
- తెలంగాణ ప్రభుత్వ సెక్టార్‌లో ఇదే మొదటిది
- నేడు గాంధీ ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభించనున్న వైద్యమంత్రి హరీష్‌రావు



గాంధీఆస్పత్రి: జన్మించడం దేవుడి ఇచ్చిన వరం.. మరొకరికి జన్మనివ్వడం మరో వరం.. సృష్టి కాదంటే, ప్రతిసృష్టి చేసి సంతానలేమితో బాధపడుతున్న దంపతుల మోములో సంతోషాన్ని నింపుతామని భరోసా ఇస్తున్నారు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వైద్యులు. పెళ్లయి ఏళ్లు గడిచినా పిల్లలు పుట్టని దంపతుల నుంచి కార్పొరేట్, ప్రైవేటు సెంటర్లు లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న క్రమంలో అవసరమైన వారికి పైసా ఖర్చు లేకుండా సంతాన సాఫల్యాన్ని కలిగించేందుకు తెలంగాణ ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి, పేట్లబురుజు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రుల్లో ఇన్ విట్రో ఫెర్టిలిటీ(ఐవీఎఫ్) సెంటర్లను ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించింది. ఈ నేపథ్యంలో అన్ని రకాల వసతులు, సదుపాయాలు, అత్యాధునిక వైద్యపరికరాలు, నిష్ణాతులైన వైద్యులతో గాంధీఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఐవీఎఫ్ సెంటర్ అందుబాటులోకి రానుంది. వైద్యమంత్రి హరీష్‌రావు, ఇతర మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గాంధీ ఐవీఎఫ్ సెంటర్‌ను ఈనెల 8వ తేది ఆదివారం ప్రారంభించనున్నారు.

ఐదేళ్ల కల సాకారం..

గాంధీ ఆస్పత్రిలో 2018లో సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు చేశారు. సరైన వసతులు కల్పించకపోవడంతో నామమాత్రంగా నడిచేది. కోవిడ్ సమయంలో గాంధీఆస్పత్రిని కరోనా నోడల్ సెంటర్‌గా మార్చడంతో ఫెర్టిలిటీ సేవలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కరోనా వైరస్ ప్రభావం తగ్గిన తర్వాత 2021 సెప్టెంబర్‌లో పునఃప్రారంభించారు. 2022 జనవరిలో పలు రకాల వసతులు కల్పించి ఇంట్రా యుటెరిన్ ఇన్‌సెమినేషన్ (ఐయూఐ)లు అందుబాటులోకి తెచ్చారు. ప్రతినెల సుమారు 700 మందికి వైద్యసేవలు అందించి సుమారు 35 శాతం ఫలితాలు సాధించారు. ఈ నేపథ్యంలో 200 పడకల మదర్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) సూపర్ స్పెషాలిటీ సెంటర్ ఇటీవల ప్రారంభం కావడంతో సంతాన సాఫల్య కేంద్రాన్ని మరింత పటిష్టం చేయాలని సీఎం కేసీఆర్, వైద్యమంత్రి హరీష్‌రావులు నిర్ణయించి నిధులు కేటాయించారు. అతి తక్కువ వ్యవధిలో నిర్మాణ పనులు పూర్తి చేసి ఇన్ విట్రో ఫెర్టిలిటీ (ఐవీఎఫ్) సెంటర్‌ను అన్ని హంగులతో తీర్చిదిద్దడంతో ఐదేళ్ల నిరీక్షణ నేటికి ఫలించింది.

ఐయూఐ.. ఐవీఎఫ్‌కు తేడా ఇదే..



మహిళ కడుపులో ఫలదీకరణ జరిగితే ఐయూఐ, ల్యాబ్‌లో జరిగితే ఐవీఎఫ్ అంటారు. కోజికోడ్, తిరువనంతపురంతో పాటు దేశంలోని పలు ఫెర్టిలిటీ సెంటర్లను పరిశీలించి, పరిశోధించి గాంధీ ఐవీఎఫ్ సెంటర్‌ను అత్యాధునికంగా తీర్చిదిదాం. పోస్ట్ కోవిడ్ ప్రభావంతో సంతానలేమి సమస్య ఎక్కువైంది. నిరుపేద దంపతులకు గాంధీ ఐవీఎఫ్ సెంటర్ ఓ వరప్రసాదం.

– ప్రొ. వెల్లంకి జానకి, ఇన్‌చార్జి గాంధీ ఫెర్టిలిటీ సెంటర్

అన్నిరకాల సేవలు పూర్తిగా ఉచితం..



సంతాన లేని దంపతులు పిల్లలు పుట్టడం కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తుంటారు. ఇకపై గాంధీ ఐవీఎఫ్ సెంటర్‌లో అన్ని రకాల వైద్యసేవలు ఉచితంగా పొందవచ్చు. ఐవీఎఫ్ సెంటర్‌తో సత్ఫలితాలు సాధించి, గాంధీ ఆస్పత్రి ఖ్యాతిని మరింత ఇనుమడింపజేస్తాం. నిధుల కేటాయించి, నిరంతరం టచ్‌లో ఉంటూ సలహాలు, సూచనలు అందించిన సీఎం కేసీఆర్, వైద్యమంత్రి హరీష్‌రావుకు ప్రత్యేక ధన్యవాదలు.

– ప్రొ. రాజారావు, గాంధీ సూపరింటెండెంట్

కార్పొరేట్‌కు దీటుగా..

గాంధీ ఎంసీహెచ్ భవనం ఐదవ అంతస్తులో ఏర్పాటు చేసిన ఐవీఎఫ్ సెంటర్‌ను రూ. కోట్ల వ్యయంతో అధునాతన పరికరాలు, అత్యంత సౌకర్యవంతమైన వసతులతో కార్పొరేట్‌కు దీటుగా రూపొందించారు. ఎంబ్రియాలజీ ల్యాబ్, ఐవీఎఫ్ ఆపరేషన్ థియేటర్, ఆండ్రాలజీ ల్యాబ్‌లతోపాటు ఫలదీకరణ చేసేందుకు అవసరమైన ఆధునిక ఎక్విప్‌మెంట్, సెమన్ ఎనాలసిస్ యంత్రాలు, రీఏజెంట్స్ (ద్రావకాలు) డయాగ్నోస్టిక్ హిస్టరీ లేపరోస్కోపీ, అల్ట్రాసౌండ్, కంట్రోల్ వేరియంట్ హైపర్ స్టిమిలేషన్ (సీఓఏ) లను సమకూర్చారు. అత్యాధునిక టెక్నాలజీతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవలను వినియోగించనున్నారు.

సనత్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: అభివృద్ధిలో సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని మోండా మార్కెట్, బన్సీలాల్‌పేట, రాంగోపాల్, బేగంపేట డివిజన్లల్లో శనివారం ఆయన పర్యటించి రూ.1.32 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. బేగంపేట భగవంతాపూర్ కాలనీ ప్రజల అవసరాల కోసం నూతన కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తామని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరిశ్రీహరి, హేమలత, దీపిక, మాజీ కార్పొరేటర్లు ఆకుల రూప, అరుణ, కిరణ్మయి, మల్లికార్జున్‌గౌడ్, డీసీ శంకర్, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, డీజీఎం శశాంక్, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏడీఈ దుర్గాప్రసాద్, హార్టికల్చర్ అధికారి గణేష్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిష్టోఫర్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి తలసాని

పరామర్శ..

బేగంపేటకు చెందిన సీనియర్ నాయకులు సలీంఖాన్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శనివారం పరామర్శించారు. సలీంఖాన్ సోదరుడు అక్బర్ అలీఖాన్ మరణించగా, విషయం తెలుసుకున్న మంత్రి శనివారం ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలోని వారి నివాసానికి వెళ్లి సలీంఖాన్‌తో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, శ్రీహరి, నరేందర్, శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, అక్బర్, ఆరీఫ్, ఖలీల్, ఫాజల్ ఉన్నారు.

ఘనంగా 'తప' సొసైటీ వార్షికోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

లాలాపేట: తప సొసైటీ ఫర్ ఏ స్మైల్ మొదటి వార్షికోత్సవ వేడుకలను శనివారం తార్నాకలోని మర్రి కృష్ణా ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు కేంద్ర ప్రభుత్వ అధికారులు ఐఏఎస్ అధికారి ఐ సామ్యూల్ ఆనంద్ కుమార్, జాతీయ దివ్యాంగ జన హక్కుల నేత పిటి వికాస్ శర్మ పాల్గొని ప్రసంగించారు. వైకల్యంతో కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో తమలో ఉన్న మేధాశక్తికి పదును పెట్టాలని సూచించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ప్రోత్సాహకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ బాల బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంస్థ నిర్వాహకులు భావన, నాగేంద్ర మాట్లాడుతూ.. మానసికంగా ఎదుగుదల లేని బాలబాలికల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడం తద్వారా తోటి ప్రజలతో కలిసి మెలిసి సమానంగా జీవనం సాగించే దిశగా తమ సంస్థ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ సీఈఓ ఆశోక్ కుమార్, తెలంగాణ వడ్డెర కోఆపరేటివ్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ బాలచారి, ఉమెన్ అండ్ విజన్ కౌన్సిల్ వ్యవస్థాపకురాలు తోట ప్రవీణ, హార్టికల్చర్ అధికారి దోనెపూడి చక్రపాణి, శాంతికుమార్, మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ సంఘం చైర్ పర్సన్ రాజారెడ్డి పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'

బన్సీలాల్‌పేట్: బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అప్పులమయంగా మారిందని.. ప్రజల జీవన ప్రమాణం పూర్తి పడిపోయిందని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రవీందర్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీ పథకాలపై బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ పథకాలు పేదల జీవితాల్లో వెలుగు నిస్తాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ సంక్షేమ పథకాల పేరిట ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపుతూ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో పేదలు జీవితాలు ఆగమ్యగోచరంగా మారాయని కాంగ్రెస్ అధికారంలో వస్తే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధు, రమేష్, సయ్యద్ అలీ, కమల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేసిన డాక్టర్ రవీందర్ గౌడ్

సృజనాత్మక బోధనతో ఎన్నో ప్రయోజనాలు

కంటోన్మెంట్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా బోధన సాగాలని ఆర్‌జీఆర్ సిద్ధాంతి విద్యాసంస్థల చైర్మన్ పీఎల్ శ్రీనివాస్ అన్నారు. కంటోన్మెంట్ అక్షర వాగ్దేవీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను డాక్టర్ గంగాధర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆధునిక జీవన శైలికి అనుగుణంగా విద్యాబోధనలోనూ పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ముఖ్యంగా సైన్స్ ఫెయిర్ వంటివి తరచూ ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగం ఉంటుందన్నారు. చదువుతో పాటే వివిధ రంగాల్లో అవగాహన పెంపొందుతుందన్నారు. విద్యార్థులు తాము రూపొందించిన వివిధ ప్రాజెక్టులను అతిథులకు వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులే జడ్జిలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ అలేఖ్య ప్రతాప్, ప్రిన్సిపాల్ వనజ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు

బంగారు ఆభరణాలు చోరీ

రాంగోపాల్‌పేట్: బస్టాప్‌లో నిలబడిఉన్న ఓ మహిళ హ్యాండ్ బ్యాగులో నుంచి 10 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైై ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ నెల 5వ తేదీన న్యూబోయిన్‌పల్లికి చెందిన జశ్విని ఊరెళ్లేందుకు బోయిన్‌పల్లి నుంచి సికింద్రాబాద్‌లోని మేడ్చల్ బస్టాప్‌లో బస్సు దిగింది. అక్కడ నిల్చుని ఉండగా ఆమె హ్యాండ్ బ్యాగ్ జిప్ తెరిచి ఉంది. దీంతో ఆమె బ్యాగును తెరిచి చూడగా అందులోని 10 తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మాదకద్రవ్యాల కట్టడికి చర్యలు



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న పోలీసులు

సికింద్రాబాద్: ఎన్నికల నేపథ్యంలో నగదు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశామని ఆర్‌పీఎఫ్ సికింద్రాబాద్ డివిజనల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ దేబశ్మిత చటోపాధ్యాయ తెలిపారు. ఇందులో భాగంగానే వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఈనెల 6న నిర్వహించిన దాడుల్లో 50 లక్షల విలువచేసే గంజాయి బ్యాగులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన టిటుపలై (40), రమేశ్ సమల్ (41)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు రూ.13.14 కోట్ల విలువచేసే గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని 55 మందిని రిమాండ్‌కు తరలించామన్నారు.

పాదయాత్రకు తరలిన ఎంఎస్‌ఎఫ్ నాయకులు



బస్సును ప్రారంభిస్తున్న కొమ్ము శేఖర్

ఉస్మానియా యూనివర్సిటీ: శీతకాలం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పాస్ చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ ఆలంపూర్ నుంచి చేపట్టిన పాదయాత్రలో పాల్గొనేందుకు ఎంఎస్‌ఎఫ్ నాయకులు ఓయూ నుంచి తరలివెళ్లారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎంఎస్‌ఎఫ్ అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ బస్సుకు జెండా ఊపి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ చేపట్టి మాదిగ, మాదిగల ఉప కులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూరన్న, ఉపేందర్, నర్సయ్య, శ్రీనివాస్, శివకుమార్, నాగేందర్, మండ్ల రవి, బాలు నాయక్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ కోలుకోవాలని పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: అనారోగ్యంతో బాధపడుతున్న సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకులు పూజలు చేశారు. శనివారం క్యాంపస్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీఎం త్వరగా కోలుకుని గతంలో ఇచ్చిన కాంట్రాక్టు అధ్యాపకుల పర్మనెంట్ ఫైల్‌పై సంతకం పెట్టాలని ఎల్లమ్మ తల్లిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ వర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ నేతలు రామేశ్వర్‌రావు, రేష్మారెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటేష్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్, హరీష్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం



గాంధీఆస్పత్రి: ప్రభుత్వ నర్సింగ్ పోస్టుల ఉన్నతీకరణపై జీవో విడుదల చేయడం పట్ల గాంధీ ఆస్పత్రి నర్సింగ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గవర్నమెంట్ హాస్పిటల్స్ నర్సెస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గాంధీ ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్, వైద్యమంత్రి హరీష్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గత కొన్నేళ్లుగా తాము చేస్తున్న డిమాండ్‌ను ఆమోదిస్తూ తెలంగాణ ప్రభుత్వం నర్సింగ్ సిబ్బంది హోదాలను మారుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నరేంద్రకుమార్, ఆర్‌ఎంఓ జయకృష్ణ, ఎల్‌ఆర్‌ఎంఓ పద్మ, డాక్టర్ రమేష్, వెంకటరమణ, చీఫ్ నర్సింగ్, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్లు మంగమ్మ, మేరీ రోజ్‌లిన్, తెలంగాణ గవర్నమెంట్ హాస్పిటల్స్ నర్సెస్ అసోషియేషన్ అధ్యక్షురాలు సుజాత పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. శనివారం కమ్యూనిటీహాల్లో జరిగిన సమావేశంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి సమక్షంలో పార్టీలోకి చేరారు. బాపూనగర్ అభివృద్ధికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేస్తున్న కృషిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. అంతే కాక దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంతో పాటు మూడు దినాలు చేసుకునేందుకు వీలుగా స్థలం కేటాయించి అభివృద్ధి పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బాపూనగర్ అధ్యక్షులు హరిసింగ్‌జాదవ్, రాకేష్‌జాదవ్, మనోజ్, విశాల్, బంటి, తరుణ్, సంతోష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న లాస్య నందిత

కంటోన్మెంట్: బంగారు తెలంగాణ స్వప్నం సాకారం కావాలంటే బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపించాలని నియోజకవర్గ లాస్య నందిత అన్నారు. శనివారం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డితో కలిసి ఒకటో వార్డు పరిధిలోని పబ్లిక్ సెక్టార్, ఉమానగర్, సంచారిపురి, వాయునగర్, విఠల్ నగర్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని జోడెద్దుల్లా నడిపిస్తున్న కేసీఆర్ సర్కారును మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గులాబీ పార్టీతోనే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ఒకటో వార్డు సంజీవయ్యనగర్‌లో పలువురు మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఆమె వెంట నివేదిత, పలువురు సీనియర్ నాయకులు, కాలనీల పెద్దలు ఉన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ జాతీయ నేతలకు సన్మానం



జాతీయ నేతలను సన్మానిస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: బిహార్ రాష్ట్రంలో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ 30వ జాతీయ మహాసభల్లో ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. జాతీయ అధ్యక్షులు మిక్కీ మహేశ్వరి, ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్‌లను తెలంగాణ ఏఐఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు ఉప్పరి ఎల్లేష్, ఓయూ నాయకులు గ్యార నరేష్, సత్య తదితరులు శాలువతో సన్మానించారు.

అన్ని వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం



ఇంటింటి ప్రచారం చేస్తున్న మర్రి ఆదిత్యారెడ్డి

సనత్‌నగర్: అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడే కాంగ్రెస్ అధికారంతోనే అందరికీ మేలు జరుగుతుందని ఆ పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు మర్రి ఆదిత్యారెడ్డి అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని డివిజన్లలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను ఇంటింటికీ వివరించారు. ఈ సందర్భంగా ఆదిత్యారెడ్డి మాట్లాడుతూ.. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆరు గ్యారెంటీ హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. మాయమాటలు చెప్పే పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

బీఆర్‌ఎస్‌ను గద్దె దింపాలి



పార్టీ సమావేశానికి హాజరైన సీపీఐ నాయకులు

సికింద్రాబాద్: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదిపేందుకు సీపీఐ కార్యకర్తలు క్రియాశీలక పాత్ర పోషించాలని ఆ పార్టీ నేతలు కోరారు. శనివారం నామాలగుండులోని బీఎస్‌ఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ సీపీఐ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. విరివిగా అభివృద్ధి పనులు చేసినట్టు ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ప్రకటనలు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేదన్నారు. ఎన్నికల నేపథ్యంలోనే ఎమ్మెల్యే అభివృద్ధి పనుల పేరిట శంకుస్థాపనలు చేస్తున్నారని విమర్శించారు. పదేళ్ల క్రితం నాటి సమస్యలు నేటికీ నియోజకవర్గంలో పదిలంగా ఉన్నాయని ఆరోపించారు. ప్రజా సంక్షేమ పథకాలను వారి పార్టీ నాయకులకే అందజేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్, కొమురెల్లి బాబు, ఉమర్‌ఖాన్, సోమయ్య, లతీఫ్, రశీద్, పత్తయ్య, కుమార్,శివ పాల్గొన్నారు.